క్లుప్తంగా

మొక్కల సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోండి..



తోగ్గూడెం గ్రామంలో డ్రెయినేజీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీల్లోని మొక్కలు చనిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిధి తోగ్గూడెం గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీని, గ్రామంలో నిర్మాణం చేయాల్సిన డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. నర్సరీలో మొక్కలు ఎప్పటికప్పుడు నీళ్లు పోయాలని మొక్కలను సంరక్షణ చేయాలని సూచించారు. డ్రెయినేజీ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. ఏఈ అనిల్‌కుమార్, ఎంపీపీ మడివి సరస్వతి, కార్యదర్శి బి.రవి ఉన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: టేకులపల్లి మండలం పెగళ్లపాడు పంచాయతీ పడమటిగుంపు గ్రామానికి చెందిన మోకాళ్ల బుచ్చయ్య–భద్రమ్మ దంపతుల కుమారుడు మోకాళ్ల భద్రం, వాసం సీతారాములు–గంగ దంపతుల కుమారుడు వాసం సాయిరాం గురువారం ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలోని సమ్మక్క సారక్క జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా రోళ్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద బూడిద లారీ ఢీకొని మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుంబాలను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ కణితి రమాదేవి, ముచ్చ సుధాకర్, లక్కినేని మురళి, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

జాతరలో ఘర్షణ

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క, సారలమ్మ జాతరలో గురువారం అర్ధరాత్రి ఘర్షణ జరిగింది. సుదిమళ్ల గ్రామ పంచాయతీ హనుమంతులపాడు గ్రామానికి చెందిన అశోక్ జాతర సంబురాల్లో నృత్యం చేసి అలసిపోయి విశ్రాంతి కోసం పక్కకు వస్తుండగా.. తమను ఎందుకు తగిలావంటూ సుభాష్‌నగర్‌కు చెందిన నలుగురు యువకులు అశోక్‌ను పక్కకు లాక్కొని వెళ్లి చితకబాదారు.

ఇదే విషయమై శుక్రవారం బాధితుడు అశోక్, అతని కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా సుభాష్‌నగర్ సర్కిల్ ప్రాంతంలో పోలీసుల నిఘా కొరవడటంతో రాత్రివేళలో ఆకతాయిల ఆగడాలు శృతిమించుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత



గుంతను పూడ్చివేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: ఇల్లెందు నుంచి రాఘబోయినగూడెం వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతను ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చివేయించారు. రహదారిపై టెలికమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో కేబుల్ పరిచేందుకు గుంతలు తవ్వారు. పనిపూర్తి చేసుకున్న సంబంధిత కాంట్రాక్టర్ కొంతదూరం గుంతను అలాగే వదిలేసి వెళ్లిపోయారు. సింగిల్ రోడ్డుపై సగం భాగం మట్టితో ఆ పక్కనే లోతైన గుంత ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని వివరిస్తూ ఈ నెల 22వ తేదీన 'పొంచి ఉన్న ప్రమాదం'శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన 'అటెన్షన్ ప్లీజ్'కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న గుంతను శుక్రవారం పూడ్చివేయించారు.

వితరణ

టేకులపల్లి: ఈనెల 13వ తేదీన సులానగర్ గ్రామానికి చెందిన పాసిని భద్రగిరి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి 100 కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఉండేటి బసవయ్య, కుమ్మరి కిరణ్ కుమార్, బల్లెం బిక్షం, కుమ్మరి చౌదరి, కొట్టే సురేష్, బొడ్డు రాము పృథ్వీకాలే సుందర్, కాలే వంశీ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క, సారక్క దర్శనంతో పులకించిన భక్తులు

- వనదేవతలకు భక్తులు పూజలు
- నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లింపు

ఇల్లెందురూరల్: వన దేవతలైన సమ్మక్క, సారలమ్మ గద్దెల మీద దర్శనమివ్వడంతో జాతర పరిపూర్ణం సంతరించుకుంది. తల్లుల దర్శన భాగ్యంతో భక్తజనం పులకించిపోయింది. సల్లంగ సూడు సమ్మక్కా.. అంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తులు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకోగా మరికొందరు మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబాలతో సహా తరలివచ్చి జాతర ప్రాంగణంలోనే రెండు రోజులుగా నిద్ర చేయడంతో జాతర ఉత్సవాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో విక్రయాలు జోరందుకున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అధిక ధరలకు విక్రయాలు కొనసాగాయి. భక్తులు అంచనాకు మించి రావడంతో నిర్వాహకులు ఉక్కిరిబిక్కిరయ్యారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ నూనావత్ చంద్రభాను, సీఐ కరుణాకర్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య పనులను డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్, ఎంపీఓ చిరంజీవి పర్యవేక్షించారు.



ఇల్లెందురూరల్: జాతర ప్రాంగణంలో భక్త జనసందోహం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంంలోని గడ్డిగుట్ట వద్ద సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. జాతర మినీ మేడారాన్ని తలపించింది. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గడ్డిగుట్ట ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. తల్లులను దర్శించుకుని భక్తులు బంగారాన్ని (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడే చెట్ల కింద టెంట్లు వేసుకుని భోజనాలు వండుకుని బస చేశారు.

టేకులపల్లి: ఆదివాసీ వీర వనితలు సమ్మక్క, సారక్క జాతర వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి, జెండాలతండా, కోయగూడెం, బోడు, రామచంద్రునిపేట, మురుట్ల, తదితర గ్రామాల్లో ఘనంగా జాతర ఘనంగా జరిగింది. గద్దెల వద్ద సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు కొలువుదీరి ఉండటంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి, నిలువెత్తు బంగారం(బెల్లం) అప్పజెప్పి మొక్కులు తీర్చుకున్నారు.

సుజాతనగర్: గరీబ్‌పేట గ్రామంలో కొలువై ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని వనదేవతలకు ప్రార్థన చేశారు. కార్యక్రమంలో సాబీర్‌పాషా, జమలయ్య ఉన్నారు.



కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గడ్డిగుట్ట గ్రామం వద్ద జాతరలో భక్తులు



సుజాతనగర్: వనదేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



టేకులపల్లి: జెండాల తండాలో...



ఇల్లెందురూరల్: జాతర వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ చంద్రభాను



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



ఇల్లెందురూరల్: గద్దెల వద్ద కిక్కిరిసిన భక్తులు



ఇల్లెందురూరల్: గద్దెల వద్ద పూజ చేస్తున్న డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్



కొత్తగూడెంరూరల్: గడ్డిగుట్ట గ్రామంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

'సింగరేణి' నిర్ణయాలు అభివృద్ధికి ఆటంకం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి బొగ్గు గనులతో విరాజిల్లుతున్న కొత్తగూడెం ఏరియా పురోభివృద్ధికి సింగరేణి నిర్ణయాలు ఆటంకంగా మారుతుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 50 సంవత్సరాలుగా వీకే 7షాఫ్ట్ మూడు వేల మంది కార్మికులతో కళకళలాడి సింగరేణిలో అతిపెద్ద గనిగా పేరు గాంచిందన్నారు. పక్కనే ఉన్న గౌతంఖని ఓపెన్ కాస్ట్‌లో ఏడు వందల పైచిలుకు కార్మికులు సుమారు 25 సంవత్సరాలుగా సింగరేణిలో అత్యధిక ఉత్పత్తి, ఉత్పాదకతలో వెలిగిన ఈ ఏరియాకు ఇప్పుడు కారుమబ్బులు కమ్ముకున్నాయని, ఇందుకు యాజమాన్య నిర్ణయాలే కారణమని ఆరోపించారు. గౌతంఖని ఓపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా, వీకే–7 షాఫ్ట్‌ను ఓపెన్ కాస్ట్ గని మార్చేందుకు సింగరేణి యాజమాన్యం రెండు సంవత్సరాల క్రితం పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను సర్దుబాటు క్రమంలో డిప్యూటేషన్‌పై జేవీఆర్ ఓసీకి, మణుగూరు ఏరియాకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు చెప్పారు. వీకే–7 ఓపెన్ కాస్ట్ అనుమతుల అనంతరం మళ్లీ కార్మికులను తిరిగి తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పుడు జరుగుతున్నదేంటని, సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఓపెన్ కాస్ట్‌ను సొధా – సుశీల్ అనే బడా కంపెనీకి అప్పగించనుందని తెలిసిందన్నారు. ఇలా జరిగితే పర్మనెంట్ కార్మికుల సంఖ్య మరింత తగ్గు ముఖం పట్టే ప్రమాదముందన్నారు. తిరిగి తీసుకుంటాని ఇచ్చిన హామీ బుట్టదాఖలే అని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో నడిపించుకునేందుకు కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, కొత్తపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'మాస్‌లైన్' బహిరంగ సభకు తరలిరండి..



ఇల్లెందు: మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

ఇల్లెందు: మార్చి3న ఖమ్మంలో నిర్వహించనున్న మాస్‌లైన్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకూబ్‌షావలీ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా రాష్ట్రాలకు సంక్రమించిన హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మూడు కమ్యూనిస్టు విప్లవ సంస్థల ఐక్య మహాసభ నిర్వహించేందుకు ప్రజాపంథా అడుగు ముందుకు వేసిందని గుర్తుచేశారు. ఈ ప్రక్రియ ద్వారా మరింత బలమైన విప్లవ పార్టీగా మాస్‌లైన్ ఆవిర్భవిస్తుందన్నారు. దీనికోసం ఖమ్మంలో నిర్వహించనున్న బహిరంగసభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో వీరన్న, దుర్గం మహేష్, కొండ ప్రకాష్, సదీప్, సంజీవ్, రవి, జానీమియా ఉపేందర్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో జరప తలపెట్టిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు కోరారు. మండల పరిధి జగన్నాథపురం, కేశవాపురం, నాగారం, బంగ్రుగొండ, దంతలబోరు, రంగాపురం, నారాయణరావుపేట తదితర గ్రామాల్లో మహాసభల ప్రచార పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పూణెం రమేష్ పాల్గొన్నారు.

నేడు పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా నేడు శనివారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలోని యాగశాలలో చండీహోమం నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామములను నమోదు చేయించుకోవాలని కోరారు.

సంప్రదాయ దుస్తులు మగవారు ధోతి, కుండువా, మహిళలు చీరలు ధరించాలని తెలిపారు. వివరాలకు 9866923261, 6303408458 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

జనం మెచ్చిన కళాకారుడు శ్రీరాములు



మాట్లాడుతున్న తుపాకుల నాగేశ్వరరావు

ఇల్లెందురూరల్: ఆటపాటలతో జనం హృదయాలను గెలుచుకున్న కళాకారుడు కోడి శ్రీరాములు అని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎల్లాపురం, తుంటుబాలు తండా గ్రామాలలో శ్రీరాములు సంతాప సభలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పెదాల నుంచి వచ్చిన పదాలనే పాటగా మలిచి ప్రజలను విప్లవ మార్గంలో నడిపించిన సహజ కవి, కళాకారుడు శ్రీరాములు అని కొనియాడారు. విప్లవోద్యమంలో ఆయన అంకితభావం మాటలకందనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మోకాళ్ల కృష్ణ, బానోత్ సంతు, నాయకులు సారంగపాణి, పాడుగు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

27న సేవాలాల్ జయంతి వేడుకలు

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ముగింపు వేడుకలకు నియోజకవర్గ ప్రజలందరూ ఆహ్వానితులేనని అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సేవాలాల్ ఇల్లెందు నియోజకవర్గ ఉత్సవ కమిటీ సభ్యుడు, సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి, టేకులపల్లికి చెందిన ధరావత్ సురేష్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జన్మదినం ఫిబ్రవరి 15వ తేదీని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సేవాలాల్ మహారాజ్ జయంతి ముగింపు వేడుకలను ఈనెల 27 న సింగరేణి గ్రౌండ్ జేకే కాలనీ ఇల్లందులో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఉదయం 9.30లకు కోటిలింగాల క్రాస్ రోడ్ దేవీఘడ్ సేవాలాల్ ఆలయంలో హారతి పూజ, 10 గంటలకు కోటిలింగాల క్రాస్ రోడ్ దేవీఘడ్ నుంచి గోవింద్ సెంటర్ కొత్త బస్టాండ్, జగదాంబ సెంటర్ మీదగా జేకే కాలనీ సింగరేణి గ్రౌండ్ వరకు శోభాయాత్ర, 11.30లకు మహాభోగ్ బండారో, మధ్యాహ్నం 12 గంటలకు సద్భావన్ సభ, రెండు గంటలకు నైవేద్యం ప్రసాదము స్వీకరణ అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. బంజారా కవులు, కళాకారులచే ఆటపాట సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఈ కార్యక్రమాన్ని దైవదర్శనంగా భావించి తప్పక హాజరై తీర్థ ప్రసాదములు స్వీకరించి సేవాలాల్ మహారాజ్ కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఓసీని సందర్శించిన జీఎం

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీని ఏరియా జీఎం జాన్ అబ్రహం శుక్రవారం సందర్శించారు. బేస్ వర్క్‌షాప్, డంపర్ సెక్షన్, ఎస్‌అండ్‌డీ సెక్షన్ స్క్రాప్ యార్డ్‌లలో పర్యటించారు. మాట్లాడుతూ.. స్క్రాప్ దొంగతనాలు జరగకుండా కంపెనీ ఆస్తుల పరిరక్షణకు సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని సూచించారు. గస్తీని ముమ్మరం చేయాలని, సెక్యూరిటీ గార్డులు విధులలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, సీవిల్ ఈఈ వెంకటేశం, జూనియర్ ఇన్‌స్పెక్టర్ అక్బర్ అలీ పాల్గొన్నారు.

రహదారి మంజూరు చేయండి



రోడ్డును పరిశీలిస్తున్న కామేష్

సుజాతనగర్: సుజాతనగర్ మండలం సీతంపేట ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి రాఘవాపురం బీటీ రోడ్డు మంజూరు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకుడు యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీతంపేట గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీతంపేట గ్రామం నుంచి రాఘవాపురం గ్రామానికి ప్రతీరోజు వందలాది మంది రైతులు, ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తుంటారని, సరైన రహదారి లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాలోతు వీరు నాయక్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగుల రవికుమార్, తడికమళ్ల దిలీప్, తాళ్లూరి మోహన్‌దాస్, తగరం శ్రీకాంత్ ఉన్నారు.

కేటీపీఎస్ ఎస్‌పీఎఫ్ ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్ల బదిలీ

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఒక కానిస్టేబుల్ బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఐజీ అనిల్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేసింది. ఇందులో భాగంగా ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్స్‌గా 244 మంది నూతనంగా రిక్రూట్ కాగా వారికి హైదరాబాద్‌లోని అమీన్‌పూర్‌లోని ఎస్‌పీఎఫ్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సిబ్బంది అవసరం ఉండటంతో కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ విలియం, 5,6 దశల కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ నరేశ్, హెడ్ కానిస్టేబుల్స్ సత్యనారాయణ, శ్యాం, కానిస్టేబుల్ వర్మలను అక్కడికి బదిలీ చేశారు.

రెండు జేసీబీలు సీజ్



అధికారులు సీజ్ చేసిన జేసీబీ

పాల్వంచరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వుతున్న రెండు జేసీబీలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు... మండల పరిధి పనుకుల గ్రామం సమీపంలో తాటి హనుమంతరావు పంటపొలంలో అనుమతులు లేకుండా మట్టి తవ్వి కేటీపీఎస్ యాష్ పాండ్‌కు తరలిస్తుండగా శుక్రవారం ఆర్‌ఐలు హచ్యా, రవికుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి రెండు జేసీబీ యంత్రాలను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఆర్‌ఐ మాట్లాడుతూ.. మట్టి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని కానీ అనుమతులు రాకముందే మట్టిని తవ్వుతున్నారని తెలిపారు. అనుమతులు వచ్చిన తరువాత మట్టి తవ్వుకోవాలని లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

చేతి, కుల వృత్తుల వారికి చేయూత

- పీఎం విశ్వకర్మ యోజనతో ప్రయోజనం
- సీఎస్సీ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పటికే మున్సిపాలిటీలో 1,400 మంది దరఖాస్తు



విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

చుంచుపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తుల వారిని ఆర్థికంగా ప్రోత్సహించేందుకు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. వారికి అవసరమైన రుణాలను అందజేస్తూ నైపుణ్యాలను నేర్పిస్తూ చేయూతనందిస్తున్నాయి. దానిలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకానికి శ్రీకారం చుట్టింది. 2023 సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగించే వారికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనతో ప్రయోజనం చేకూరనుంది. చిన్న, మధ్య తరహా వ్యాపారాల ద్వారా కులవృత్తులు చేసుకునేందుకు వీలుగా, ఆర్థిక చేయూత అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దీనిపై పంచాయతీలు, పురపాలక సంఘ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ పథకానికి నెల రోజులుగా ఆసక్తి గలిగిన కులవృత్తుల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకు ఆధార్‌కార్డు, బ్యాంకుపాస్ బుక్, రేషన్‌కార్డు వంటివి ధ్రువీకరణ పత్రాలను జత చేసి సీఎస్సీ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగూడెం నియోజకవర్గంలోని చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాలతో పాటు కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల పరిధిలో సుమారు 1400 మంది ఈ విశ్వకర్మ పథకానికి ఇప్పటికే దరఖాస్తులు అందజేశారు.

విశ్వకర్మ యోజన పథకం మార్గదర్శకాలు...

- ఈ పథకం కోసం ముందుగా ఇంటర్‌నెట్‌లో సీఎస్సీ, మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- కేంద్రప్రభుత్వం ప్రవేశపట్టిన ఈ పథకానికి చేతి వృత్తులపై ఆధారపడి, 18 సంవత్సరాల వయస్సు పైబడిన వారు అర్హులు.
- గతంలో కేంద్ర ప్రభుత్వ (పీఎంఈజీపీ, స్వనిధి, ముద్ర వంటి) పథకాల ద్వారా ఎటువంటి రుణ సదుపాయం పొంది ఉండకూడదు. కుటుంబంలో ఒక్కరు మాత్రమే ఈ పథకానికి అర్హులు.
- దరఖాస్తుదారుని ఇంట్లో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులు ఉండకూడదు. మూడు విడతలుగా ప్రతీ విడతకు రూ.లక్ష, రూ.రెండు లక్షలు, రూ.మూడు లక్షల వరకు రుణం అందజేస్తారు.
- మొదటి విడతలో 5 శాతం వడ్డీతో రూ.లక్ష, 18 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. రెండో విడతలో రూ.2 లక్షలను 30 నెలల వ్యవధిలో చెల్లించాల్సి ఉంటుంది.

18 రకాల వ్యాపారాలకు అవకాశం...

ఈ విశ్వకర్మ పథకంలో 18 రకాల వ్యాపారాలకు రుణ సదుపాయం పొందే వీలుంది. కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, శిల్పి, కుండలు, దుస్తులు, చీపుర్ల తయారీ, బార్బర్, చెప్పులు కుట్టేవారు, బొమ్మల తయారీ, చేపల వల, దండలు చేసేవారు, తాపీ పని లాంటి వృత్తులు ఉన్నాయి. రుణానికి ఎంపికైన వారిలో అవసరం ఉన్న వారికి రెండు రకాలుగా శిక్షణ ఇస్తారు. మొదట ప్రాథమిక నైపుణ్యం పెంపొందేలా 15 రోజులు శిక్షణ అందిస్తారు. రోజుకు రూ.500 భృతి చెల్లిస్తారు. శిక్షణ తర్వాత రూ.15 వేల విలువైన టూల్ కిట్లు అందజేస్తారు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి...



కుల, చేతి వృత్తుల బలోపేతంతో పాటు వారికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం విశ్వకర్మ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకంలో మూడు విడతలుగా రుణాన్ని అందిస్తారు. వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం జిల్లా కమిటీలో అర్హులను ఎంపిక చేస్తారు. వారికి శిక్షణతో పాటు ధ్రువపత్రం అందిస్తారు. దగ్గరలో ఉన్న మీసేవ, సీఎస్సీ కేంద్రాల ద్వారా ఎవరైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఆకుల నాగేశ్వరరావు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు, విశ్వకర్మ పథకం